
చేవూరుపాలెంలో జగనన్న ఇళ్ల స్థలం


ముక్కొల్లుపాడులోని జగనన్న కాలనీ లేఔట్ ఇలా..

కదలని ఇళ్లు!

రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఇళ్లు అంటూ ఎంతో గొప్పలు చెబుతూ చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అతీ గతీ లేకుండా పడి ఉన్నాయి. దాదాపు అన్ని లేఅవుట్లు చిట్టడవులను తలపిస్తున్నాయి. ముళ్ల కంచెలు, తుప్పలతో దర్శనమివ్వడంతో జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఆసక్తి చూపించడం లేదు. ఎన్నికల ముందు ఇళ్ల నిర్మాణం మొదలుపెడితే బిల్లు ఆగిపోయి ఇబ్బందులు పడతామని, వచ్చే ప్రభుత్వం ఈ సర్కార్ హయాంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు ఇస్తుందో లేదోనని లబ్ధిదారులు భయపడుతున్నారు. జగనన్న కాలనీలకు విద్యుత్, నీటి వసతి, రహదారులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టడం లేదు. ఇసుక, ఇటుక, ఇనుము, కంకరు, ఇతర మెటీరియల్ ధరలు, తాపీ మేస్త్రీల రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో ఇంటి నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు తాపీ పనివారికి మాత్రమే సరిపోతోం దని, సర్కార్ సాయం పోను చిన్న ఇల్లు కట్టాలన్నా కనీసం రూ.3 నుంచి 5లక్షలు ఉంటేనే పూర్తవుతుందని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదు.

జగనన్న లేఅవుట్ల దుస్థితి ఇదీ..

- ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారుల అనాసక్తి
- చిట్టడవులను తలపిస్తున్న లే అవుట్లు
- మౌలిక వసతుల కల్పన ఊసే లేదు
- పెరిగిన నిర్మాణ వ్యయం.. వేధిస్తున్న బిల్లుల భయం
- రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టేదెలా.. ? లబ్ధిదారుల ఆవేదన

- చాట్రాయి : చాట్రాయి మండలంలో 35 జగనన్న లేఅవుట్లు ఉండగా 22 లేఅవుట్లలో అరకొరగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. 1,730 మందికి లేఅవుట్లలో పట్టాలు ఇవ్వగా, ఇందులో ఇళ్లు కట్టుకుంటామని ముందుకొచ్చిన 240 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వీరిలో 101 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మండల కేంద్రం చాట్రాయి లేఅవుట్‌లో 123 ప్లాట్లు ఉండగా ఇక్కడ కేవలం ఇద్దరు మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టటం గమనార్హం.
- ముసునూరు : మండలంలో 25 లేఅవుట్లు వేసి 2109 మందికి ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున ఇళ్ల పట్టాలను పంపిణీ చేయగా ఏడు లేఅవుట్లు కోర్టు పరిధిలో ఉన్నాయి. గతేడాది ఫేజ్ -2లో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, నేటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో జగనన్న కాలనీ లేఅవుట్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఇటీవల కొర్లకుంట, బలివే, చెక్కపల్లి, రమణక్కపేట లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు లేకపోయినా పంట పొలాల్లో నుంచి నీటిని సమకూర్చుకుని సుమారు 50 గృహాల నిర్మాణాలను ప్రారంభించగా, అవి నేటికీ ముందుకు సాగని పరిస్థితి. ముసునూరు సంధ్యవవాగు వద్ద వేసిన లేఅవుట్ నివాసాలకు ఆమోదయోగ్యంగా లేదని లబ్ధిదారులకు ఆందోళన చేయడంతో అధికారులు ప్రత్యామ్నాయంగా భూసేకరణ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో వాగు పోరంబోకులు, కుంటలు పూడ్చి లేఅవుట్లు వేయడంతో లబ్ధిదారులు ఇళ్ల స్థలాలు తీసుకునేందుకు విముఖత చూపుతున్నారు.
- కలిదిండి : మండలంలో 2,091 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరయ్యాయి. వీటిలో ప్రస్తుతం 1,542 ఇళ్ల పట్టాలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. కలిదిండి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం మందకొడిగా సాగుతోంది. కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి మట్టి రోడ్డు కావడంతో మెటీరియల్ తరలించడానికి ఇబ్బందిగా ఉంది. వాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. ఈ కాలనీలో మొత్తం 755 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించగా 20 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వర్షం వస్తే లేఅవుట్ నీట మునుగుతోంది.
- నూజివీడు టౌన్ : మండలంలోని ముక్కొల్లుపాడు, బోర్వంచ గ్రామాల్లో 220 మంది లబ్ధిదారులకు, నూజివీడు పట్టణ పరిధిలోని ట్రిపుల్ ఐటీ సమీపంలో 150 మందికి స్థలాలు మంజూరు చేయగా నివాసయోగ్యంగా కావంటూ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాలేదు. కేవలం బోర్వంచలో ఒక్క ఇల్లు అదీ మొండిగోడల వరకే కట్టి నిలిపివేశారు. మిగతా ఎక్కడా పునాదులు కూడా పడలేదు.
- ముదినేపల్లి రూరల్ : మండలంలోని శ్రీహరిపురం శివారు చేవూరుపాలెంలో జగనన్న లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్థలాల్లో నేటికి గృహ నిర్మాణం ప్రారంభించకపోవడంతో ఆయా స్థలాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. స్థలాలు పూడిక చేయటానికి అధికారులు నిర్లక్ష్యం వహించడంతో లబ్ధిదారులు నేటికి ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ 44 మంది లబ్ధిదారులకు స్థలాలివ్వగా ఒక్కరూ ఇల్లు నిర్మించలేదు.
- లింగపాలెం : మండలంలో ధర్మాజీగూడెం, కొత్తపల్లి, యడవల్లి, రంగాపురం గ్రామాల్లో ఇచ్చిన కాలనీ స్థలాలు కోర్టు కేసులో ఉండడంతో ఇళ్లు కట్టుకోవడానికి ఎవరూ రాక నిరుపయోగంగా మారాయి. వేములపల్లిలో శ్మశానంలో స్థలాలు ఇవ్వడంతో సమాధుల మధ్య ఇళ్ల కట్టుకోలేమంటూ లబ్ధిదారులు నిరాకరించారు. మండలంలో మొత్తం 856 లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా, 450 మంది కట్టుకోకుండా ఉన్నారు. చెరువు భూములు, ముంపు స్థలాలు, శ్మశానాల్లో ఇంటిస్థలాలు ఇవ్వడంతో వాటిలో ఇళ్లు కట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.


ముళ్లపొదలతో నిండిన ముసునూరు లేఅవుట్


పిచ్చిమొక్కలతో నిండిన వలసపల్లి లేఅవుట్


చాట్రాయి లేఅవుట్‌లో 123 ప్లాట్లకు కేవలం రెండిళ్ల నిర్మాణం


అధ్వానంగా కలిదిండి జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన మట్టి రోడ్డు


వేములపల్లిలో నిరుపయోగంగా ఇళ్ల స్థలాలు


ముక్కొల్లుపాడులో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో జగనన్న లేఅవుట్


ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శాంతకుమారి, ఏఎస్పీ స్వరూపారాణి

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి

- డీటీసీ శాంతకుమారి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15 : ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ సమయాల్లో రోడ్డు, ట్రాఫిక్ పై తగిన ఏకాగ్రత, పరిశీలనతో వ్యవహరించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని ఉపరవాణా కమిషనర్ ఎస్. శాంత కుమారి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఏలూరు శాంతినగర్ పోలీస్ బంకు వద్ద మోటారు సైకిల్ హెల్మెట్ అవగాహన ర్యాలీ డీటీసీ శాంతకుమారి, అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి కలసి జెండా ఊపి ప్రారంభించారు. డీటీసీ మాట్లాడుతూ 2030 నాటికి రోడ్డు ప్రమాదాలను సగానికి తగ్గించాలనే లక్ష్యంతో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గతేడాది జిల్లా 636 రోడ్డు ప్రమాదాలు జరిగితే 284 మంది ప్రాణాలను కోల్పోగా, 617 మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. అధికశాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, ఏకాగ్రత లోపించడం, రెడ్‌లైట్ సిగ్నల్ దాటడం, సీట్ బెల్టు, హెల్మెట్ ధరించకపోవడం, తప్పు పద్ధతిలో ఓవర్ టేక్ చేయడం, మత్తు పదార్థాలు తాగడం, సెల్‌ఫోన్ మాట్లాడడం, లైన్ డ్రైవింగ్‌ను అనుసరించకపోవడం తదితర కారణాలు మానవ తప్పిదాలు కాగా రహదారి, వాతావరణ పరిస్థితులు ఇతర కారణాలుగా ఉన్నాయన్నారు. ఏఎస్పీ స్వరూపరాణి మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 74 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వీటిలో 42 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తనిఖీలు చేసే పోలీసుల కోసం హెల్మెట్ ధరించడం కాదని మన ప్రాణాలు మనం కాపాడుకోవాలని, మన కుటుంబ సభ్యుల కోసం మనం ఉండాలని ఆశతో వాహనాలు భద్రంగా నడపాలని సూచించారు. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు మాట్లాడుతూ నగర ప్రాంతాల్లో హెల్మెట్ ధరించనవసరం లేదని అపోహ ఉందని, ద్విచక్ర వాహనం ఏ ప్రాంతంలో నడిపినా ఖచ్చితంగా హెల్మెట్ అనేది ధరించి తీరాలని ఆయన సూచించారు. మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు కేవీఎస్ ప్రసాద్, జి.ప్రసాదరావు, రహదారి భద్రత వైద్యురాలు జి.మౌనిక, ఏలూరు ట్రాఫిక్ సీఐ కె శ్రీనివాసరావు, ఎస్‌ఐ ప్రకాశరావు, ఏలూరు సాయి స్వర్ణ మోటార్స్ జనరల్ మేనేజర్ ఎవి సోమేశ్వరరావు, వారి సిబ్బంది, పవన్ హోండా సిబ్బంది, సివిల్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, పట్టణంలోని వాహన డీలర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 85 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15 : జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 2,953 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2,868మంది హాజరయ్యారని డీఐఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.



ఇంటి పోరు!

- ఇప్పటికే వైసీపీ ఎదురీత.. స్వపక్షంలోనే వర్గాల మోకాలడ్డు
- టీడీపీ రెబల్స్‌పై కన్నేసిన వైసీపీ నేతలు
- ఓట్ల గల్లంతుకు పన్నాగాలు

ఓట్ల కోసం ఎదురీదుతున్న వైసీపీ అభ్యర్థులకు ఇంటి పోరు వేధిస్తోంది. రాష్ట్రంలో సాగుతున్న అసమర్థ పాలన నుంచి ఓటర్లను డైవర్ట్ చేయడంలో నిమగ్నమైన నియోజకవర్గ అభ్యర్థులకు ఇప్పుడు రెబల్స్ ముల్లులా మారారు. కులాలు, సంఘాల వారీగా ఓట్లను చీల్చడంలో బిజీగా ఉన్నారు. మరోవైపు గెలుపే పరమావధిగా పెట్టుకున్న వైసీపీ అభ్యర్థుల కన్ను టీడీపీ రెబల్స్‌పై పడింది. వారి ద్వారా ఓట్లను రాల్చే రాజకీయానికి పదును పెడుతున్నారు. ఏలూరు, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో వెలుగు చూస్తున్న ఆ ప్రయత్నాలకు టీడీపీ రివర్స్ పంచ్ ఇస్తోంది.

ఏలూరు-ఆంధ్రజ్యోతి :

గడిచిన ఐదేళ్లుగా జిల్లా వైసీపీలో వర్గ పోరు సాగుతోంది. 2019, 2024లో అభ్యర్థిగా ప్రయత్నాలు బెడిసికొట్టిన, చివరి నిమిషంలో టిక్కెట్ చేజార్చుకున్న నాయకుల ధాటికి ప్రస్తుత అభ్యర్థులు విలవిల్లాడుతున్నారు. ఓ వైపు జగనన్న అసమర్థ పాలన, మరోవైపు చాప కింద నీరులా పాకుతున్న వర్గ పోరుతో వైసీపీ అభ్యర్థులకు నిద్ర లేకుండా చేస్తోంది. ఏలూరు నియోజకవర్గంలో నిన్నటి వరకు వైసీపీ అభ్యర్థిత్వానికి సిట్టింగ్ ఎమ్మెల్యేతో పాటు మేయర్ నూర్జహాన్ భర్త పెదబాబు ప్రయత్నించారు. ఈ క్రమంలో పెదబాబు నుంచి నాని ఊహించని పోటీని ఎదుర్కొన్నారనడంలో అతిశయోక్తి లేదు. ఓ దశలో నాని సైతం పోటీ నుంచి విరమించుకోవాలని చూసినా, పెదబాబు రంగంలోకి దిగారన్న విషయం తెలిసి తన ప్రయత్నాలను విరమించుకున్నారు. సీటు తనకు దక్కకపోయినా పర్లేదు కానీ, పెదబాబుకు వెళ్లనిచ్చే సమస్య లేదంటూ భీష్మించారు. వారివురూ పార్టీ కార్యక్రమాల్లో కలిసిమెలిసి తిరుగుతున్నా, ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత పోరు ఉందన్న విషయం బహిరంగ రహస్యమే. ఈ క్రమంలోనే కార్పొరేషన్ పైనా పైచేయి సాధించడానికి నాని చేయని ప్రయత్నాలు లేవు. మేయర్ పదవి పెదబాబు చేతిలో ఉన్నా, పెత్తనం మాత్రం ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఇప్పటివరకు నడిచింది. ఎక్కువ మెజారిటీ కార్పొరేటర్లు మేయర్ కంటే కూడా ఎమ్మెల్యే వైపే మొగ్గు చూపుతారు. ఈ క్రమంలో కార్పొరేషన్ కమిషనర్ మొదలు ఉద్యోగుల, సిబ్బంది నియామకాల వరకు ఎమ్మెల్యేనే శాసిస్తూ వచ్చారు. అందరి ముందు ఎమ్మెల్యే మాటే శిరోధార్యం అని చెప్తున్నా, అవకాశం వస్తే ఎమ్మెల్యేగా బరిలో దిగడానికి పెదబాబు ఆది నుంచి సై అంటూనే ఉన్నారు. ఎటుతిరిగి టీడీపీ నుంచే పెదబాబుకు అసలైన సవాల్ ఎదురవుతోంది. టీడీపీ నుంచి బడేటి రాధాకృష్ణయ్య బరిలో ఉంటే వైసీపీ అభ్యర్థిగా పెదబాబు గెలుపు కష్టమేనన్న విషయాన్ని అధిష్ఠానానికి చేర వేయడంలో నాని వర్గాలు సక్సెస్ అయ్యాయనే చెప్పాలి. బడేటి, ఆళ్ల మధ్యన జరిగే పోటీలో టీడీపీ-జనసేన కూటమికే 11 శాతం గెలుపు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఏలూరులో టీడీపీకి మద్దతుకు సిద్ధంగా ఉన్న 9.3 శాతం న్యూట్రల్ ఓటింగ్‌ను చీల్చాలనే ప్రయత్నాల్లో నాని వర్గీయులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ ప్రయత్నాలకు ఇప్పటికే బడేటి గండి కొట్టారు. తన సోదరుడి పనితీరుకు తనపై నమ్మకం ఉంచాలంటూ కొన్నేళ్లుగా ప్రజలతో మమేకమవుతూ వైసీపీ ఆశలపై నీళ్లు చల్లారు. కాగా టీడీపీ రెబల్స్ వైపు ఇప్పుడు వైసీపీ దృష్టి సారిస్తున్నట్టు సమాచారం. ఏలూరు నియోజకవర్గంలో 2019 ఎన్నికలను పరిశీలిస్తే విడిగా పోటీ చేయగా దాదాపు 10 శాతానికి పైగా ఓట్లు జనసేనకు పోలయ్యా యి. పెదబాబు రూపేణా సుమారు 2-3 వేలకు పైగా ఓట్లు చీలాయి. ఈ నేపథ్యంలోనే సుమారు 5 వేల ఓట్ల తేడాతో అప్పటి అభ్యర్థి ఓడిపోయారు. కానీ ఈసారి టీడీపీ చరిష్మా గతం కంటే మెరుగవడంతో పాటు టీడీపీ-జనసేన కూటమి ఏకతాటిపై నడుస్తుండటంతో గెలుపు అవకాశాలు 11 శాతం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో టీడీపీ, వైసీపీకి ప్రస్తుతానికి దూరంగా మసలుతోన్న న్యూట్రల్ ఓటింగ్‌పై వైసీపీ నాయకులు కన్నేశారు. న్యూట్రల్‌గా ఉన్న ఓట్లలో 80 శాతం ఓటింగ్‌ను తమ వైపునకు మరల్చుకున్నా గెలుపు అవకాశాలు దాదాపు మెరుగైనట్లేనని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. న్యూట్రల్ ఓటింగ్‌లో భాగంగా వైసీపీ కారణంగా నష్టపోయి, అవమానాలు పడి, ఆర్థికంగా కుదేలైన నాయకులను ఆళ్ల వర్గాలు కలుపుకునే దిశగా పావులు కదుపుతున్నాయి. 2019లో ఏ ఓట్లైతే టీడీపీకి పడకుండా అడ్డుకున్నారో ఆ ఓటింగ్‌ను ఈసారి వైసీపీకి మరలకుండా ప్రయత్నించడంలోనూ ఓ పెద్ద వర్గం ప్రయత్నిస్తోంది.


టీడీపీ రెబల్స్‌పై కన్ను

ఏలూరు, నూజివీడు, కైకలూరులో టీడీపీ నుంచి టిక్కెట్లు ఆశించిన వారినీ ఇప్పుడు వైసీపీ టార్గెట్ చేస్తోంది. ఒక్కో రెబల్ అభ్యర్థికి మద్దతుగా ఉన్న ఓట్లను కొనేయాలనే మాస్టర్ ప్లాన్ వేస్తోంది. ప్రయత్నాలు ఫలించని క్రమంలో ఆ అభ్యర్థిని రెబల్‌గా పోటీ చేయించడానికీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఇటీవలే ఓ అభ్యర్థిని ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే గతంలో పిలిపించారన్న వార్తలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఆ అభ్యర్థికి టీడీపీ నుంచి అవకాశం రాని క్రమంలో రెబల్ అభ్యర్థి నియోజకవర్గంతో పాటు తన నియోజకవర్గం నుంచీ అతని కుమారుడితో నామినేషన్ వేయించాలనే దిశగా అప్పట్లో చర్చలు జరిగాయట! కాగా ఇప్పుడు అదే నియోజకవర్గంపై అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే కన్ను పడింది. స్థానికంగా ఉన్న వర్గ విభేదాలను రెచ్చగొట్టడమే కాకుండా, సదరు రెబల్‌గా గుర్తిస్తున్న అభ్యర్థి తరపు నుంచీ ఓట్లను కొనుగోలు చేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. టీడీపీ అభ్యర్థిని అధికారికంగా అధిష్ఠానం నిర్ధారించాకే అసలు కథకు వైసీపీ నాయకులు శ్రీకారం చుట్టడానికి సన్నద్ధమవుతున్నారు.

స్వీప్‌తో ఓటర్లలో చైతన్యం

- కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 15 : జిల్లాలో రాబోయే ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా రానున్న 45 రోజుల పాటు ముమ్మరంగా 'స్వీప్' చైతన్య కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని కలెక్టర్, జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేశ్ చెప్పారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో గురువారం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యకలాపాలు అండ్ స్వీప్ 2024 జిల్లా కార్యాచరణ ప్రణాళిక అమలుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్వీప్ కార్యక్రమాలకు సంబంధించి రూపొందించిన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాలను, ఓటర్లను చైతన్య పరిచేందుకు అవగాహన పరిచే వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికలలో 90 నుంచి 92 శాతం మంది శాతం పోలింగ్ నమోదయ్యే విధంగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో జిల్లా సగటు ఎన్నికల పోలింగ్ 86 శాతం నమోదైందని ఏలూరు అర్బన్ ప్రాంతంలో 69.02 శాతం నమోదైందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఏలూరు అర్బన్ తోపాటు నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో కూడా ఓటర్ టర్నవుట్ పెంపు లక్ష్యంగా అన్ని ప్రయత్నాలు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో నమోదైన సగటు శాతాన్ని 3 విభాగాలుగా విభజించుకుని ఆ దిశగా ఎక్కడైతే పోలింగ్ శాతం తక్కువగా నమోదు అయిందో అందుకు గల కారణాలను విశ్లేషించాలన్నారు. దానికి అనుగుణంగా నియోజక వర్గంలో ఓటర్ టర్నోవర్ ఇంప్లిమెంటేషన్ ప్లాన్‌ను అమలు చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ఐదు రోజుల లోపు సంబంధిత పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా చునావ్ పాఠశాల కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు సంబంధిత ఏఆర్వోలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో సూర్యతేజ, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజులు స్వీప్ కార్యక్రమాల గురించి, ఈవీఎంల పనితీరును వివరించారు. సమావేశంలో డీఆర్వో పుష్పమణి, ఆర్డీవో అద్దయ్య, డీఈవో అబ్రహం, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఇతర అధికారులు

ఎమ్మెల్యే లేకుండానే..

- చింతలపూడి నియోజకవర్గంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు..


వీరిశెట్టిగూడెంలో సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, చిత్రంలో ఎంపీ కోటగిరి

కామవరపుకోట, ఫిబ్రవరి 15 : మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయాలు ప్రారంభోత్సవాలు, రోడ్ల నిర్మాణాలకు శంకు స్థాపనలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల సభలు నిర్వహించినా ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా లేకుండానే జరపడం విశేషం. కామ వరపుకోట నుంచి రామన్నపాలెం మీదుగా తూర్పుయడవల్లి వెళ్లేందుకు నాలుగు కోట్ల రూపాయల అంచనాతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఎంపీ కోటగిరి శ్రీధర్, వైసీపీ ఏలూరు పార్లమెంటు ఇన్‌చార్జి కారు మూరి సునీల్‌కుమార్, వైసీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు స్థానిక నాయకులతో పాటు శంకుస్థాపన చేశారు. వీరిశెట్టిగూడెం, తడికలపూడి, రావికంపాడు, అంకాలంపాడు గ్రామాల్లో పలు ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవాలు చేశారు. శిలాఫలకాలపై ఎమ్మెల్యే ఎలీజా పేరు ఉన్నప్పటికీ ఆయన ఏ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఈ విషయంపై ఎమ్మెల్యే ఎలీజాను వివరణ కోరగా అధికారులు, ఉద్యోగులు, జిల్లా యంత్రాంగం తనను ఆహ్వానించలేదని తెలిపారు. ఎమ్మెల్యే లేకుండానే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని పలువురు ప్రజాస్వామ్య వాదులు పేర్కొంటున్నారు.

టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలకు కృషి

▸ పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో వెంకటరమణ



టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటరమణ

ఆకివీడు, ఫిబ్రవరి 15: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ ఏడాది జిల్లాలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళిక చేపట్టామని పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులతో సమీక్ష సమావేశం నిర్వహించి విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 386 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలున్నాయని వాటిలో 24 వేలమంది విద్యార్థులున్నారన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీ,డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు ఏఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో సంబంధిత ఉపాధ్యాయులు దత్తత తీసుకుని తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఉదయం, సాయంత్రం ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులచే తయాచు చేయించిన మెటీరిల్‌ను ఆన్‌లైన్‌లో పెట్టామన్నారు. పాఠశాల హెచ్‌ఎం తోట పోతురాజు, ఉపాధ్యాయులు అరవింద్, వెంకటస్వామి, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 15 : ఏలూరు జిల్లా కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023-24లో ఐదో తరగతిలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. 6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల్లో చేరేందుకు విద్యార్థులు ఏప్రిల్ పదో తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, ఏప్రిల్ 21న పరీక్ష ఉంటుందన్నారు. రాతపరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. రాత పరీక్ష కేఆర్‌పురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల బాలబాలికల పాఠశాలల్లో ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు దగ్గరలోని గురుకుల విద్యాలయానికి వెళ్లి ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

● మన్యం జిల్లా, విశాఖపట్నం జిల్లా, ఏలూరు జిల్లాల్లోని పార్వతీపురం, జోగంపేట, మారికవలస, విస్సన్నపేట ప్రాంతాల్లోని ప్రతిభ పాఠశాల, కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఎనిమిదో తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్‌లో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను మార్చి 25వ తేదీ లోగా, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన కేఆర్ పురంలోని గురుకుల బాలుర పాఠశాలలో జరుగుతుందన్నారు.

మృదుల కుమారికి 'స్త్రీశక్తి పురస్కారం'



మృదుల కుమారి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15 : గాంధేయ మహిళ చర్ల మృదుల కుమారి 'స్త్రీశక్తి-2024' పురస్కారానికి ఎంపిక చేశామని సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపా రు. గత 50 ఏళ్లుగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఆమె పలుసేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. సర్వోదయ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 16న ఈ అవార్డును ఆమెకు అందజేస్తామని తెలిపారు.

రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌కు చింతలపూడి విద్యార్థినులు



రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థినులు


చింతలపూడి, ఫిబ్రవరి 15 : చింతలపూడి జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు వి.భార్గవి, వి.నవ్యశ్రీ రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం మాటూరి చక్రధరరావు తెలిపారు. కొవ్వలి హైస్కూలులో ఈనెల 14న జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని 'ఉమెన్ సేఫ్టీ డివైస్' అనే టాపిక్‌ను ప్రదర్శించారు. ఈ డివైస్‌తో ప్రతీ బాలిక లేక మహిళ అనుకోకుండా ప్రమాదానికి గురైతే ఆ ప్రమాదం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు డివైస్ ద్వారా ప్రదర్శన చూపారు. ఈ ప్రదర్శనను ఇన్‌స్పైర్ ఇన్‌చార్జ్ అమిత్ జైన్ ప్రశంసించారు. చిత్తూరు జిల్లాలో ఈనెల 18న జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థినులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు గైడ్ టీచర్స్ ఆర్.సత్యకుమారి, ఎం.డి.షర్మిలను పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



విలేకరులతో మాట్లాడుతున్న మేరీ గ్రేస్‌కుమారి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 15 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మార్చి 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, చిట్‌ఫండ్ కేసులు, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ తగాదాలు తదితర కేసులను రాజీ చేస్తామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌కు ఏడువేల కేసులను రాజీయోగ్యమైన కేసులుగా గుర్తించామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కేసుల మధ్యవర్తిత్వానికి హాజరుకాలేని దూర ప్రాంతాల్లో నివసిస్తున్న కక్షిదారులు ఆన్‌లైన్ మార్గం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉపయోగించుకుని రాబోయే లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.



మార్టేరు పరిశోధన కేంద్రం కాంట్రాక్టు కార్మికుల నిరసన

నేటి నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

పెనుమంట్ర, ఫిబ్రవరి 15 : మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోని కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. గురువారం మూడో రోజుకి చేరుకున్న ఆందోళనలు.. 16వతేదీ నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తారని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పెనుమంట్ర మండల సీఐటీయూ కార్యదర్శి కోడి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వల్ల పరిశోధనా కేంద్రంలోని వరి పంటలు దెబ్బతినే పరిస్థితి వచ్చిందన్నారు. ఏళ్ల తరబడి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వ మొండి వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించిందని వెల్లడించారు. ఉభయ గోదావరి జిల్లాల వేలాది రైతులకు వేగుచుక్కగా ఉన్న మార్టేరు వరి పరిశోధనా కేంద్రం నూతన వరి వంగడాలు ఆవిష్కరించి అందజేస్తున్నదని, అటువంటి ముఖ్యమైన పరిశోధనా స్థానంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వానికి పెద్దసమస్య కాదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ నాయకురాలు దమ్ము నూకరత్నం, కట్టా శ్రీలక్ష్మి, బొంతు నాగలక్ష్మి, వెలగల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

శోభనాచలస్వామి గరుడోత్సవం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 15: ఆగిరిపల్లి రథసప్తమి తిరునాళ్ళ సందర్భంగా గురువారం శోభనాచలస్వామి పెద్దగరుడ వాహనంపై విహరించారు. ఉదయం శాంతి కల్యాణంలో భాగంగా ఆకుల బసవా ప్రసాద్ సాయంత్రం జరిగే నిత్యకల్యాణంలో భాగంగా కమ్మ సంఘం ఆధ్వర్యంలో మాదల శివరామ్‌ప్రసాద్ దంపతులు కైంకర్యపరులుగా పాల్గొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

వాడవల్లిలో రూ.2.03 లక్షల చోరీ

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 15: వాడవల్లి గ్రామానికి చెందిన దూసనపూడి గురుబ్రహ్మం మంగళవారం ఇంటికి తాళం వేసి వైద్యం నిమిత్తం విజయవాడ వెళ్లి బుధవారం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో దాచి ఉంచిన రూ. 2.03 లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించి బాధితుడు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వెంకటకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కమ్మేసిన మంచు



దువ్వ వద్ద హైవేపై..



భీమవరం రైల్వే వంతెనపై మంచు



కైకరం వద్ద హైవేపై కురుస్తున్న మంచు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పెరిగిన మంచు

- రాత్రి సమయాల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మంచులో ప్రయాణాలు ప్రమాదకరం
- ఇబ్బందులు పడుతున్న రైతులు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 15: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుఝామున మంచు కమ్మేసింది. విపరీతంగా పేరుకుపోయి మంచుదుప్పటిలా ఏర్పడింది. ఉదయం సమయంలో రహదారులు కనిపించకపోవడంతో ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి. చాలామంది ప్రయాణికులు తమ వాహనాలను రహదారుల పక్కన నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం సమయంలో ప్రజలు బయటకు వెళితే శ్వాసకోశ సంబంధమైన వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం వంటి ఆనారోగ్యాల పాలవుతున్నారు. రాత్రి సమయం మాదిరిగా వాహనాల లైట్లు వేసుకుని నడపాల్సి వచ్చింది. వేసవి కాలం దగ్గర పడుతున్న సమయంలో మంచు విపరీతంగా కురియటంతో పంటలు దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా మామిడితోటలో పూత మాడిపోతుందని, మంగు వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని రైతులు చెబుతు న్నారు. రబీ సాగు ఆరంభించిన సమయంలో తెల్లవారు ఝాము సమయంలోనే వ్యవసాయ కూలీలు, రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు ఏలూరు జిల్లాలో 34 నుంచి 35 డిగ్రీల వరకు నమోదయ్యాయని, రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రత లు 22 నుంచి 18 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయాయి. పశ్చిమ జిల్లాలో 32 నుంచి 35 వరకు నమోదయ్యాయని, రాత్రి సమయాల్లో 19 నుంచి 16 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయాయి.



జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో మంచు

ఉమ్మడి పశ్చిమలో ఉష్ణోగ్రతలు ఇలా..

రోజు	ఏలూరు జిల్లా (పగలు/రాత్రి)	పశ్చిమ జిల్లా (పగలు/రాత్రి)
ఫిబ్రవరి 9	35/22	35/18
10వ తేదీ	35/21	33/19
11వ తేదీ	34/19	35/18
12వ తేదీ	34/18	32/16
13వ తేదీ	34/18	35/18
14వ తేదీ	34/18	32/16
15వ తేదీ	35/18	34/18

● మంచు ఎక్కువగా కురిసే సమయంలో రహదారులపై బహిరంగంగా ప్రయాణించడం ఆరోగ్యానికి మంచిది కాదని, ఆ సమయంలో జాగ్రత్తలు తీసుకుని బయటకు వెళ్ళాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం సమయాల్లో వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించుకోవాలి



పెదవేగిలో మంచు

ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలి

కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచు కారణంగా రోగాలు బారిన పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ప్రతీ ఒక్కరూ మాస్క్ ధరించాల్సిందే. చెవులు, ముక్కు కప్పుకునే విధంగా ఉండాలి. అవసరమైతే మంకీ క్యాప్ మంచిది. బయటకు వెళ్ళే మహిళలు, చిన్నపిల్లలు చెవుల్లో కాటన్ పెట్టుకుంటే మంచిది. వైరల్ ఫీవర్లు, శ్వాసకోశ సంబంధిత వ్యాదులు వచ్చే ప్రమాదం ఉంది. ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సత్యసంజీవ్ చిక్కం, ఎండి హోమియోపతి, భీమవరం





ఆకివీడులో కురుస్తున్న మంచు

క్రైం కార్నర్

బస్సును ఢీకొట్టిన లారీ

27 మందికి గాయాలు

ఏలూరు ఆస్పత్రికి ఐదుగురి తరలింపు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 15:ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటనలో 27 మంది ప్రయాణికులు గాయాల పాలైన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలోని హైవేపై జరిగింది. ఎవరికి ప్రాణ నష్టం కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో నైట్ అవుట్ చేసి గురువారం ఉదయం జంగారెడ్డిగూడెం బయలు దేరింది. వయా తెల్లంవారిగూడెం, ముప్పినవారిగూడెం, బుట్టాయగూడెం మీదుగా 57 మంది ప్రయాణికులతో వస్తున్న బస్సు మరో ఐదు నిమిషాల్లో పట్టణానికి చేరుకునే క్రమంలో అశ్వారావుపేట నుంచి రాజమండ్రి వైపునకు వెళ్తున్న లారీ.. బస్సు వెనుక ఎమర్జెన్సీ డోర్ వద్ద బలంగా ఢీ కొంది. బస్సులో ఉన్న 27 మందికి గాయాలయ్యాయి. స్థానికులు ప్రయాణికులను బస్సులోనుంచి దించి అటుగా వెళ్తున్న ఆటోలపై స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు క్షతగాత్రులకు అత్యవసర చికిత్స అందించి తీవ్రంగా గాయపడిన ఐదుగురు నక్కా అలివేలు, మోత్రపు సందీప్, పుంజుగల పవన్‌కుమార్, కొరసా రామసీత, జుత్తుగ ఇందిరలను మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సురేశ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విషయం తెలుసుకున్న క్షతగాత్రుల బంధువులు, స్నేహితులు ఆసుపత్రికి చేరడంతో ఆసుపత్రి అంతా జనంతో నిండిపోయింది.



ఆర్టీసీ బస్సు



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులకు వైద్యం



బాధితులను పరామర్శిస్తున్న ఆర్టీసీ డీఎం గంగాధర్, సిబ్బంది

● జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బస్సు ప్రమాద బాధితులను పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు, జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ పొల్నాటి బాబ్జి, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం తదితరులు పరామర్శించారు.

ఆర్టీసీ బస్సు-వ్యాన్ ఢీ

డ్రైవర్, ఇద్దరు ప్రయాణికులకు గాయాలు



వ్యాన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు



బస్సు-వ్యాన్ ఢీకొన్న దృశ్యం

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 15 : జీలుగుమిల్లి హైవేపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు, ఐషర్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ టి.రమేష్ వ్యాన్‌లో ఇరుక్కుపోయాడు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ స్థానికులు కలసి వ్యాన్ ముందు భాగం ట్రాక్టరు సాయంతో లాగి ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జంగారెడ్డిగూడెం నుంచి వేలేరుపాడు నైట్ హాల్ట్ బస్సు వెళుతుంది. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం ప్లాస్టిక్ పైపులు తరలిస్తున్న వ్యాన్ రెండూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. డ్రైవర్‌కు తలకు, మోకాళ్లకు గాయాలు కాగా వేలేరుపాడుకు చెందిన వృద్ధురాలు తూం మంగమ్మ, శివకాసీపురానికి చెందిన లీలాకుమారికి గాయా లు కావడంతో జీలుగుమిల్లి పీహెచ్‌సీలో వైద్యం పొందారు. ఆర్టీసీ బస్సులో వేలేరుపా డుకు చెందిన వారు వంద మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలిపారు. సంఘటన స్థలం వద్ద ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేశారు. జీలుగుమిల్లి ప్రధాన నాల్గు రోడ్డు కూడలిలో పలు దుకాణాలు సైతం రోడ్డుపైకి చొచ్చుకు వచ్చి వ్యాపారాలు సాగిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు పాదచారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామన్నారు.

నేల బావిలో పడి వ్యక్తి మృతి



రవి మృతదేహం

లింగపాలెం, ఫిబ్రవరి 15: ప్రమాదవశాత్తు నేలబావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. చింతలపూడి మండలం బాలవారి గూడెం గ్రామానికి చెందిన రాయల రవి(23)అనే వ్యక్తి గ్రామానికి వచ్చి బయటకు వెళ్ళినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామంలోని ఓ నేల బావిలో వ్యక్తి మృతదేహం గుర్తించామని, అతడు రాయల రవిగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. రాయల రవి మృతిపై గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 15 :భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనాకోడేరు కాల్వలో కాళ్ళ మండలం కోనాలపల్లికి చెందిన సిరింగి విస్సాకు(52) మృతదేహాన్ని గుర్తించినట్టు టూటౌన్ ఎస్ఐ జీజే ప్రసాద్ గురువారం తెలిపారు. విస్సాకు అనే వ్యక్తి మతిస్థితమితం లేకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. గురువారం ఉదయం అనాకోడేరు కాల్వలో మృతదేహం ఉన్నట్టు సమాచారం అందడంతో వివరాలు సేకరిస్తుండగా మృతుడి సోదరుడు డేవిడ్ గుర్తించారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

పెనుమంట్ర,ఫిబ్రవరి 15 : బ్రాహ్మణచెరువు కొండాలమ్మ గుడి వద్ద ఇసుక లారీ బోల్తా కొట్టింది. మార్టేరు నుంచి బ్రాహ్మణ చెరువు వస్తున్న సమయంలో మంచు వల్ల దారి కనిపించకపోవడంతో ఇసుక లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభం వల్ల బోల్తా కొట్టింది. ఎలక్ట్రికల్ స్తంభాన్ని ఢీకొట్టడం వల్ల విద్యుత్ వైర్లు తెగి రోడ్లపై పడి కరెంట్ షాక్ గురయ్యేవారని... స్తంభం శిథిలం కాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు చెబుతున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆకివీడు, ఫిబ్రవరి 15: ఆకివీడు రైల్వేస్టేషన్ రోడ్‌లోని తీగలదొడ్డి దగ్గర మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. మద్యం అమ్ముతున్నట్టు సమాచారంతో గురువారం దాడి చేసి అతడి వద్ద నుంచి 180 ఎంఎల్ బాటిల్స్-4, నాలుగు బీర్ల సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

భోగోలులో వృద్ధురాలి మృతి

లింగపాలెం, ఫిబ్రవరి 15: భోగోలు గ్రామంలో మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. భోగోలు గ్రామానికి చెందిన తాడేపల్లి భాగ్యం(68)అనే మహిళ మతిస్థిమితం లేకుండా ఉంటుంది. బుధవారం కుటుంబసభ్యులు పనికి వెళ్లగా ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి పడిపోయినట్టు తెలిపారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా ధర్మాజీగూడెంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం మరణించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 15 : విద్యుత్ షాక్‌కు గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ డి. దుర్గామహేశ్వరరావు తెలిపారు. కామవరపుకోట మండలం వీరభద్రకాలనీకి చెందిన బుంగా రవి కుమారుడు సాయి(21) కరెంటు పనులకు వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీన మక్కినవారిగూడెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కరెంట్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కిందపడిపోయాడు. యువకుడి బంధువులు విజయవాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 14న మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తణుకు జనరల్ స్టోర్‌లో చోరీకి యత్నం



చోరీకి ప్రయత్నించిన షాపు

తణుకు, ఫిబ్రవరి 15 : తణుకు పట్టణంలోని సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న ఓ జనరల్ స్టోర్‌లో గుర్తుతెలియని దుండగలు చోరీకి ప్రయత్నం చేశారు. ఈఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. బాలకృష్ణ అనే వ్యాపారికి చెందిన జనరల్ స్టోర్ షట్టర్ పగులకొట్టేందుకు ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చారు. గడ్డర్లతో వచ్చిన దుండగులు షట్టర్ పగులకొట్టేందుకు ప్రయత్నించినప్పటికీ రాకపోవడంతో వెనుతిరిగారు. ఈ ఘటనలన్నీ సీసీ ఫుటేజీలో నమోదయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తల జోలికొస్తే తాటతీస్తాం

▸ 60 రోజుల తర్వాత అందరి లెక్కలు తేలుస్తాం : చింతమనేని



గాయపడిన డాక్టర్ మధును పరామర్శిస్తున్న చింతమనేని ప్రభాకర్

దెందులూరు, ఫిబ్రవరి 15 : 'అన్యాయంగా టీడీపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే తాటతీస్తాం. పార్టీ శ్రేణులందరూ ధైర్యంగా ఉండాలి. 60 రోజుల్లో టీడీపీ అధికారంలోకి వచ్చాక అందరి లెక్కలు తేలుస్తాం' అని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు హెచ్చరించారు. ఇటీవల లక్ష్మీపురం సమీపంలో రాత్రి సమయాల్లో అక్రమంగా పోలవరం కాల్వ మట్టిని వైసీపీ నేతలు తరలిస్తుండగా అడ్డుకున్న టీడీపీ సీనియర్ నేత డాక్టర్ పసుమర్తి మధుపై వైసీపీ నేతలు మూకుమ్మడి దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడిలో గాయాలపాలై హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన మధు ఇంటికెళ్లి గురువారం పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ చెరువులు, పోలవరం కాల్వ అక్రమ మైనింగ్ మట్టి తరలింపుపై ప్రశ్నించే టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి అన్యాయంగా పోలీసులను ఉపయోగించుకుని తిరిగి బాధితులపైనే కేసులు పెడుతున్నారన్నాని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నాని, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఏనుగు రామకృష్ణం ఖప్పిలి వెంకటేశ్వరావు, గారపాటి కొండయ్యచౌదరి, పెనుబోయిన మహేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవలో సినీనటుడు క్రాంతికుమార్



ఆలయ ప్రాంగణంలో కుటుంబసమేతంగా నటుడు క్రాంతి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 15: చినవెంకన్న ఆలయాన్ని సినీనటుడు క్రాంతికుమార్ గురువారం కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకు న్నారు. ఉప్పెన సినిమాలో తాను ఒక మంచి పాత్రను పోషించినట్టు తెలిపారు. స్వామి వారి దర్శనం సంతోషం కలిగించిందన్నారు.

పవన్ కల్యాణ్‌కు జోగయ్య లేఖ

పాలకొల్లు, ఫిబ్రవరి 15 : జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు గురువారం రాష్ట్ర కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య లేఖ రాశారు. ఈ మేరకు లేఖలోని అంశాలను గురువారం విలేకరులకు వివరించారు. రాష్ట్రంలో 25 శాతం జనాభా ఉన్న కాపు, ఒంటరి బలిజ, తూర్పుకాపు కులస్థులకు తగిన రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 41 అసెంబ్లీ స్థానాలు, ఆరు పార్లమెంట్ స్థానాలను కాపులకు ఇవ్వాలని కోరారు. అయా స్థానాల్లో పోటీకి నిలపాల్సిన అభ్యర్థుల పేర్లను కూడా సూచించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో-6, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా-7, ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు-5, విశాఖ జిల్లా-7, కృష్ణా జిల్లా-3, గుంటూరు-2, నెల్లూరు జిల్లా-1, ప్రకాశం జిల్లా -1, రాయలసీమ నాలుగు జిల్లాల్లో-9 స్థానాలను జనసేన పార్టీకి కేటాయించాలని సూచించారు. నరసాపురం, కాకినాడ, మచిలీపట్నం, అనకాపల్లి, రాజంపేట, విజయనగరం ఆరు పార్లమెంట్ స్థానాలను కాపులకు కేటాయించాలని జోగయ్య కోరారు.

సైనికోద్యోగి రమేష్‌బాబుకు అంతిమ వీడ్కోలు



రమేష్‌బాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 15: కోల్‌కత రెజిమెంట్‌లో విధులు నిర్వహిస్తున్న తాడేపల్లిగూడెంలోని సత్యవతినగర్‌కు చెందిన జగజ్యోతుల రమేష్‌బా బుకు బుధవారం సైనికోద్యోగులు అంతిమ వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో కోల్‌కత ఆర్మీ ఆసుపత్రిలో మంగళవారం తుదిశ్వాస విడిచిన రమేష్ బాబు మృతదేహాన్ని ప్రత్యేక విమానం ద్వారా హైదరాబాద్ తరలించి అక్కడ నుంచి అంబులెన్స్ ద్వారా గురువారం తాడేపల్లిగూడెంకు తరలించారు. తాడేపల్లిగూడెంలో ఎన్‌సీసీ డ్రిల్ ర్యాలీగా మృతదేహాన్ని పాతూరు రుద్రభూ మికి తరలించి అంతిమ సం స్కారాలు నిర్వహించారు. అతని మృతదేహానికి ఆర్మీ ఉన్నతాధికారులు కమాం డ్ కర్నల్ సౌరబ్ ముఖర్జీ, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, సుబేదార్ ఆదినా రాఆయణ, సుబేదార్ దోమిని తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఏజెన్సీలో నాటు తుపాకీ స్వాధీనం

పోలవరం, ఫిబ్రవరి 15 : పోలవరం ఏజెన్సీలోని గుంజవరం గ్రామ మొక్కజొన్న తోటలో నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన ఎస్ఐ పవన్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు అందిన సమాచారం మేరకు వీర్వోలు, మధ్యవర్తులతో మొక్కజొన్న తోటలో దాచి ఉంచిన నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు చుట్టుపక్కల వారిని విచారించగా ఎవరిదీ కాదనడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వైసీపీ పాలనలో దళితులపై దాడులు : చింతమనేని


చింతమనేనితో దళిత మహాసేన నేతలు

పెదవేగి, ఫిబ్రవరి 15: వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దళితుల రక్షణ కోసం రూపొందించిన ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టాన్ని రాజకీయ కక్ష సాధింపుల కోసం దుర్వినియోగం చేస్తున్న వ్యక్తి జగన్‌రెడ్డి అని చింతమనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుగ్గిరాలలోని స్వగృహంలో అనుచరులతో దళిత మహాసేన నాయకుడు రాజేష్ గురువారం చింతమనేనిని కలిశారు. ఈ నెల 18న నిడదవోలులో నిర్వహించే దగాపడ్డ దళితుడా రా.. కదలిరా కార్యక్రమం వివరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈ సభ విజయవంతానికి సహకరించాలని రాజేష్ కోరారు. ప్రభాకర్ మాట్లాడుతూ తాను దళితుల పక్షపాతినేనని, మహాసభ విజయవంతానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. నమ్మి ఓట్లేసిన పాపానికి అన్ని వర్గాలను జగన్‌రెడ్డి దగా చేశాడన్నారు. జగన్ పాలనలో దళితులపై దాడులు మరింతగా పెరిగిపోయాయన్నారు. దళిత మహాసేన నాయకులతోపాటు టీడీపీ నాయకులు తాతా సత్యనారాయణ, నేతల రవి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి టిక్కెట్ మాల సామాజిక వర్గానికి ఇవ్వాలి

అచ్చెన్నాయుడిని కలిసిన టీడీపీ ఎస్సీ సెల్ ప్రతినిధులు


అచ్చెన్నాయుడికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

చింతలపూడి, ఫిబ్రవరి 15: రానున్న ఎన్నికల్లో చింతలపూడి ఎమ్మెల్యే స్థానం మాల సామాజిక వర్గానికి కేటాయించాలని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రతినిధులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి వినతిపత్రం ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం అచ్చెన్నాయుడిని వారు కలిశారు. ఎస్సీ రిజర్వుడు స్థానంలో ఇప్పటివరకు మూడు పర్యాయాలు మాల సామాజికవర్గ అభ్యర్థికే కేటాయించడాన్ని వారు గుర్తు చేశారు. ఈసారి కూడా అదే సామాజిక వర్గానికి ఇస్తే అభ్యర్థిని గెలిపించుకుంటామని, నిర్ణయం ఏదైనా శిరసావహిస్తామన్నారు. నాలుగు మండలాల టీడీపీ ఎస్సీ సెల్ ప్రతినిధులు భారీగా తరలివెళ్లారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తాం : ఆలపాటి

పెదవేగి, ఫిబ్రవరి 15: దెందులూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోట అని, కాంగ్రెస్ పార్టీ నుంచి దెందులూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ముగ్గురు మంత్రులుగా పనిచేశారని నియోజకవర్గ కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి తెలిపారు. దెందులూరులో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన చెప్పారు. ముందురులో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ పర్యటనలు విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో దెందులూరు నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. పదేళ్ళ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, ఉపాధి అవకాశాలు లేక యువత వలస పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. యువతకు ఉపాధి అవకాశాలు రావాలన్నా, గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావాలన్నారు. పూర్వపు కాంగ్రెస్ నాయకులు తిరిగి పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే మరింత మంది పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

వైభవంగా సాయి మహాస్తూపం వార్షికోత్సవం


స్థూపానికి మొక్కుతున్న భక్తులు

పెదవేగి, ఫిబ్రవరి 15: లక్ష్మీపురం వరలక్ష్మి సాయికోటి మహాస్తూపం వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం కాకడ హారతి, సుప్రభాత సేవ, పుష్పాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజాము 4.30 గంటల నుంచి సాయిబాబా దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయినాథుని దర్శించుకున్న అనంతరం భక్తులు సాయికోటి పుస్తకాలను వంద అడుగుల వరలక్ష్మి శ్రీసాయి మహాస్తూపంలో నిక్షిప్తం చేశారు. భారీసంఖ్యలో భక్తులు రావడంతో సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

షిరిడీ సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 15: నగరంలో సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారపుపేట షిరిడీ సాయి ప్రేమమందిర్‌లో బాబా వారికి పంచామృతాభిషేకం అనంతరం విశేష అలంకరణ చేశారు. పల్లకీ సేవా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దక్షిణపువీధి, పవరుపేట, 12 పంపుల సెంటర్, నరసింహారావుపేట, పత్తేబాద, ఆర్‌ఆర్‌పేట తదితర ప్రాంతాల్లోని షిరిడీ సాయి మందిరాల వద్ద భక్తులు విశేష పూజలు చేశారు.

నేటి నుంచి రథసప్తమి మహోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 15: ధన్వంతరి వైద్యభగవాన్ విశ్వరూప మందిరం వద్ద శుక్రవారం నుంచి రథసప్తమి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. పాతబస్టాండ్ సెంటర్‌లోని పాండురంగస్వామి ఆలయం ప్రాంగణంలో రథసప్తమి ఉత్సవాలను శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు దండిబొట్ల కనక సుందరశర్మ, ఈవో సీహెచ్.చిననాగేశ్వరరావు తెలిపారు.

18న అచ్యుతాపురం రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ


నూతనంగా నిర్మించిన రామాలయం

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 15: మండలంలోని అచ్యుతాపురంలో నిర్మించిన ఆలయంలో ఈ నెల 18న సీతా కోదండరామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. శుక్రవారం నుంచి 18 వరకు పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

20 నుంచి వీరభద్రుడి కల్యాణ మహోత్సవాలు

కామవరపుకోట, ఫిబ్రవరి 15: పురాతన భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి మార్చి 2 వరకు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తుమ్మలపల్లి శ్రీనివాసరావు, కొండూరు శ్రీధర్, వందనపు మురళీ, వంకదార ఉదయ్‌లు తెలిపారు. 20 నుంచి 23 వరకు పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరుగుతాయన్నారు. 23న రాత్రి గండ దీపాలతో స్వామివారిని దర్శించుకోవడం, వీరంగ నృత్యాలు జరుగుతాయని, 24న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 25న రథోత్సవం జరుగుతుందన్నారు.

నేటి నుంచి అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు


ఉత్సవ ఏర్పాట్లు, అమ్మవారు

దెందులూరు, ఫిబ్రవరి 15: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24 వరకూ ఉత్సవాల నిర్వహణకు కమిటీ ఏర్పాట్లు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ముందుగానే తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ, పోలీసులు, ఉత్సవ కమిటీ సంయుక్తంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


కొయ్యలగూడెంలో సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ నేతల నినాదాలు


జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు



పోలవరంలో గిరిజన సంఘం రైతు కూలీల ప్రదర్శన


కొత్తూరులో ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

సమ్మెకు సమాయత్తం

• కేంద్ర ప్రభుత్వ విధానాలపై రైతు కూలీ, కార్మిక సంఘాల నిరసన • నేడు బంద్ జయప్రదం చేయాలని పిలుపు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. నరసింహ, కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అన్నేభవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ మద్దతు ధరల గ్యారెంటీ చట్టం కోసం రైతులు ఢిల్లీలో పోరాడుతున్నారన్నారు. మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు రైతులు చేసిన పోరాట ఫలితంగా ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్లు మోదీ రాతపూర్వకంగా ఇచ్చారన్నారు. హామీలు నెరవేర్చకుండా కేంద్రం రైతులను మోసం చేసిందన్నారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రుణ మాఫీ చేయాలన్నారు. 50ఏళ్లు దాటిన రైతు, కౌలురైతులకు పింఛన్ ఇవ్వాలన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమంలో మరణించిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. నేడు జరగబోయే బంద్ విజయవంతం చేయాలని కోరారు.

● కొయ్యలగూడెం: దేశవ్యాప్త చేపట్టే నిరసనలు కార్యక్రమాలు, గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాంబాబు కోరారు. గురువారం పోస్టర్లు విడుదల చేశారు. కొత్తచట్టాలు వెంటనే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ కార్యక్రమాల్లో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మోదీ ప్రభుత్వం రైతు వ్యవసాయ కార్మిక కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం జరుగుతున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు కార్మిక వ్యవసాయ కార్మిక ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. గురువారం ప్రజా సంఘాల కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. పి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేవీ.రమణ, జీవరత్నం మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగిస్తోందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకులు ఎల్ఐసీ, తదితర సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని చూస్తోందని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్‌లుగా తెచ్చిందని, రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసిన మరొక రూపంలో అమలు చేస్తోందన్నారు. ప్రజలంతా బంద్ జయప్రదం చేయాలని కోరారు. లక్ష్మణరావు. బి.నాని, పి.సత్తిబాబు, జు.ఆనందరావు, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు గ్రామీణ బంద్‌కు సహకరించాలని గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం సంయుక్తంగా గురువారం ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. కుంజం రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన అన్ని రకాల హామీలను అమలు చేయాలన్నారు. శుక్రవారం చేస్తున్న బంద్‌లో వ్యాపారులు, వర్తక వాణిజ్య సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు మిడియం పోశీరావు, కొమరం రామారావు తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతు ఉద్యమంపై నిరంకుశ చర్యలు చేపట్టడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో పెదపాడు మండలం కొత్తూరులో ఎడ్లబండ్ల, ట్రాక్టర్లతో గురువారం ప్రదర్శన నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు డిమాండ్స్ పరిష్కారం కోసం పోరాటం చేస్తుంటే మోదీ ప్రభుత్వం వారిపై యుద్ధం ప్రకటించడం అన్యాయమన్నారు. ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ప్రదర్శనలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.



జడ్పీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు


గొల్లగూడెం హైస్కూలులో పోస్ట్ కార్డులతో యూటీఎఫ్ నేతల నిరసన



జంగారెడ్డిగూడెంలో చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల నిరసన

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం జడ్పీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, పెండింగ్ డీఏ వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ, అరియర్స్ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులర్ ప్రక్రియ చేయాలన్నారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్‌లలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి ప్రతినెల మొదటి రోజునే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఉద్యోగులు ఉద్యమ శంఖారావం పూరించిన విషయం తెలిసిందే. తొలిరోజే ఉద్యోగులు ప్రతిఘటన చూపారు. మూడోరోజు సైతం పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, సంఘాల నాయకులు, ఆర్‌ఎస్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ యూటీఎఫ్ కార్డు ఉద్యమం

ఉంగుటూరు: సీపీఎస్ రద్దు చేసి దాని ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరుతూ యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం నిర్వహించారు. గురువారం విరామ సమయంలో వివిధ రాజకీయ పార్టీలను కోరుతూ ఉద్యమాన్ని చేపట్టింది. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగినాయుడు, శీతాల సత్యనారాయణ, సీహెచ్.శ్రీధర్, హరికృష్ణ, ఊట ఆనందకుమార్, పుప్పాల నరసింహారావు, బొమ్మిడి ప్రసాద్, తీడ శ్రీధర్, కె.ప్రేమ్‌కుమార్, గొల్లగూడెం హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు ఉద్యోగులు తరలిరావాలి

జంగారెడ్డిగూడెం టౌన్: సీపీఎస్ ఉద్యోగులందరూ ఈ నెల 18న విజయవాడలో జరిగే చలో విజయవాడ ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమంలో పాల్గొనాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగ దుర్గారావు అన్నారు. గురువారం జడ్పీ ఉన్నత పాఠశాల తాడువాయి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తాడువాయి మెయిన్, జొన్నవారిగూడెంలో చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ధర్మరాజు, ఎన్.ఏసురత్నం, ఆచార్యులు, రామారావు, జి.గంగ ముత్యం, కె.దేవకరుణ, పి.ఎలీషా, రూపా తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఇండోర్ స్టేడియంలో షటిల్ కోర్టు నిర్మాణం

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ఏలూరు ఇండోర్‌స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా టోర్నమెంట్‌లో బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమస్థానం పొందిన విజేతలను కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సత్కరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానం పొందడం అభినందనీయమని, రాష్ట్రస్పోర్ట్స్ కార్యదర్శితో తాము సంప్రదించగా ఇండోర్ స్టేడియంలో కూలిన బ్యాడ్మింటన్ కోర్టు పునరుద్దరణకు కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారన్నారు. కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, డీఆర్వో పుష్పమణి, డీఎస్‌డీవో డి.శ్రీనివాసరావు, పలువురు క్రీడాకోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ ఆదర్శం

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ప్రజలతో మమేకమై సేవలందించే వలంటీర్ వ్యవస్థ ఆదర్శనీయమని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. జిల్లాలో సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను గురువారం మెడల్, ప్రశంసాపత్రం, నగదు బహుమతితో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు తమ అనుభవాలను పంచుకున్నారు. డీఆర్వో పుష్పమణి, డీపీవో తూతిక విశ్వనాథ్‌శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయ్‌రాజు, డీఎల్‌డీవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి


సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళి

టి.నరసాపురం, ఫిబ్రవరి 15: లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బంజారా భజరంగీ భేరి కమిటీ సభ్యుడు భూక్యా వేణుగోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. కృష్ణాపురంలో లంబాడీల సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వృద్ధులకు పాలు రొట్టెలు పంపిణీ చేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ లంబాడీ తండాలను ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో భూక్యా భీగనాథం, తేజావత్ బాలాజీ, జరబల చిన్ని, భూక్యా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: గిరిజన లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి గురువారం కోయరాజమండ్రి తండాలో నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని, నూతన భవనాన్ని సుగాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరావు నాయక్ ప్రారంభించారు. తెలంగాణలో మహారాజ్ జయంతి ప్రభుత్వమే అధికారికం గా జరుపుతుందన్నారు. గిరిజన లంబాడీ భాషా గోర్బోలిని అధికారికంగా గుర్తించాలన్నారు. గుగ్గలోతు మోహనరావు, బాణోతు కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనకు కాపు సంఘాల సమావేశాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15: రాజ్యాధికారం, రిజర్వేషన్ల సాధన లక్ష్యాలుగా ఆకుల రామకృష్ణ నాయకత్వంలోని కాపు జేఏసీ, చందు జనార్దన్ నాయకత్వంలోని కాపు జాగృతి ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం కాపు సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్టు కాపునాడు ఉమ్మడి జిల్లా ప్రతినిధి రావి శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ నెల 27న విజయవాడలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాపు, మున్నూరు కాపు, తూర్పు కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలవారికి సామాజిక, ఆర్థిక, రాజకీయన్యాయం జరిగేవిధంగా రాజకీయ పార్టీలన్నీ కృషిచేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు రామమోహనరావు, రంగిసెట్టి మంగబాబు, ముత్యాల రామదాసు, వాసురెడ్డి ఏసుదాసు, ఆరేటి ప్రకాష్, తోట రాజీవ్, నల్లా విష్ణు, ఎం.సాయి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 15: ప్రతి విద్యార్థి సమాజాభివృద్ధి కోసం కృషి చేసిన శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని కొండా రవి అన్నారు. నారాయణపురం హైస్కూలులో శాస్త్రవేత్త గెలీలియో జయంతిని గురువారం నిర్వహించారు. గెలీలియో టెలిస్కోప్‌ను కనుగొని సూర్యుని చుట్టూ భూమి గుండ్రంగా ఉందని నిరూపించిన గెలీలియోను నాటి సమాజం తిరస్కరించి మరణ శిక్ష విధించిందన్నారు. ఆధునిక భౌతిక, గణిత, తత్వ శాస్త్రాలలో నైపుణ్యం సాధించా లన్నారు.ఏలూరు ఏవీఆర్.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, కొర్ని అప్పారావు, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు నాక్ ఎ గుర్తింపు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15: బోధనారంగంలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు, ఫలితాలు సాధిస్తున్న సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు 3.25రేటింగ్ (సీజీపీఏ)తో ఎ గ్రేడ్‌ను 'నాక్' ప్రకటించింది. ఈ మేరకు ఐదేళ్ల కాలవ్యవధితో కూడిన ధ్రువీకరణ పత్రాన్ని గురువారం నాక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధులు ఫార్మసీ కళాశాల ప్రతినిధులకు ఏలూరులో అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కరస్పాండెంట్ ఎం.రాజారామ్మోహన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీగా బాధ్యతలు చేపట్టిన సోమశేఖర్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15: సమగ్రశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా సోమశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయనకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి ఈ నెల 1న ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఏపీసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. గురువారం ఉత్తర్వులు అందడంతో ఆయన విధుల్లో చేరారు. సోమశేఖర్ తొలుత డీఈవో ఎస్.అబ్రహాంను కలిశారు. ఆయనకు కార్యాలయ సెక్టోరల్ అధికారులు రమేష్, రామారావు, రాధాకృష్ణ, లక్ష్మణరావు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

స్ట్రాంగ్‌రూం వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు

పెదపాడు, ఫిబ్రవరి 15 : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌ల వద్ద పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లుగా పెదపాడు తహసీల్దారు భావన్నరాయణ తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌ను రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. తహశీల్దారు భావన్నరాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్ట్రాంగ్ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిడమర్రు లో మన ఇంటికి మన గన్ని


నిడమర్రులో గన్ని వీరాంజనేయులు పర్యటన

నిడమర్రు, ఫిబ్రవరి 15: బడుగ బలహీన వర్గాలకు అండగా నిలిచి సంక్షేమానికి కృషి చేసిన పార్టీగా టీడీపీ ప్రజల గుండెల్లో ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. నిడమర్రులో గురువారం మన ఊరు మన గన్ని కార్యక్రమంలో ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు, స్థానిక మహిళలతో కలసి గ్రామంలో పర్యటించారు. గన్ని మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో సంక్షేమానికి చిరునామాగా నిలిచే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. జనసేన - తెలుగుదేశం ఉమ్మడి ప్రభుత్వం లో అన్ని వర్గాల అభ్యున్నతి కోసంపాటుపడతామన్నారు. మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, సత్తినీడి నాని, ఆదిరెడ్డి చంద్రరావు, అంబళ్ల విజయభాస్కర్, గఫ్ఫార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 15: భూహక్కుల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. తోర్లపాటి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ చట్టం వలన సన్న, చిన్న కారు రైతులు, మధ్యతరగతి రైతాంగం అధికంగా నష్టపోతారన్నారు. న్యాయవాదుల నిరసన కార్యక్రమాలకు మాల మహానాడు మద్దతు ఉంటుందన్నారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రజల ఆస్తులకు భంగం వాటిల్లే విధంగా ఉందన్నారు. చట్టాన్ని తక్షణమే రద్దు పరచకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. జిల్లా అధ్యక్షుడు గుండె నగేశ్‌బాబు, సరళ, రఘు, గాది రవి, బొడ్డు వాసు, వెంపల రాజు, వల్లెంకల విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖ ఉద్యోగులకు పని ఒత్తిడి

కుక్కునూరు, ఫిబ్రవరి 15: వైద్య శాఖ ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగిందని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.జోగారావు అన్నారు. గురువారం కొండపల్లిలో ఆదివాసీ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, లక్ష్యాలు అంటూ పని భారం పెంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెమో, షోకాజ్ నోటీసులు అంటూ బెదిరిస్తున్నారన్నారు. పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సులను మాత్రమే నియమిస్తున్నారని, ఏదైనా అవసరం నిమిత్తం ఒక స్టాఫ్ నర్స్ సెలవు పెడితే మిగిలిన ఇద్దరు సిబ్బంది 24 గంటలు పని చేయవలసి వస్తుందన్నారు. గిరిజన ప్రాంత ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నలుగురు స్టాఫ్ నర్సులను నియమించాలన్నారు. ఐటీడీఏ పరిధిలో పీహెచ్‌సీలలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని, జీవో 68 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు సున్నం శ్రీరాములు దొర, ఎస్.నాగేశ్వరరావు, కె.రాజారావు, ఎస్.బుచ్చయ్య, వెంకటలక్ష్మి, మాధవి, వేణు,పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఉంగుటూరు :** బాదంపూడి, వెల్లమిల్లి స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని చేబ్రోలు సెక్షన్ విద్యుత్ అధికారి శ్రీరాం తెలిపారు.
- **పెదపాడు :** రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా పూర్తిస్థాయిలో ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందని ఏవో ప్రదీప్‌కుమార్ తెలిపారు. కొక్కిరపాడులో సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- పెదపాడు మండలం అప్పనవీడులో ప్రజా ఆశీర్వాద యాత్రను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గురువారం నిర్వహించారు. ఏంఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్‌తో కలిసి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
- **పెదవేగి :** పినకడిమి జడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన దాత జాస్తి రాజన్‌బాబు, వారి కుటుంబ సభ్యులు రూ.25వేల విలువైన ప్రింటర్‌ను బహూకరించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తేరా ప్రభాకర్, నాగార్జున, పీడీ రామారావు దాత రాజన్‌బాబు, కుటుంబ సభ్యులను అభినందించారు.
- **బుట్టాయగూడెం :** రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలో జరిగిన వైఎస్సార్ సేవాదళ్ ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, చినిమిలి వెంకట్రాయుడు, జినిగి కిషోర్, గంజిమాల దేవి, ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.


సూపర్ 6 పథకాలు వివరిస్తున్న చంటి

అరాచక పాలన

వైసీపీ తీరుపై బడేటి చంటి ధ్వజం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర 11వ డివిజన్‌లో గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి సూపర్ 6 పథకాలు వివరించారు. వైసీపీ పాలనలో అరాచకాలు, అక్రమ కేసులు ఇసుక, మద్యం మాఫియా పెరిగిపోయాయన్నారు. ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు వైసీపీ ప్రభుత్వం దిగుతుందన్నారు. రాష్ట్రం గంజాయి నిలయంగా మారిందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని జగన్ సర్వనాశం చేశాడన్నారు. జగన్ పాలనతో అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయన్నారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో చోడే వెంకటరత్నం, బాల సుబ్రహ్మణ్యం, ఎస్.పద్మావతి, ఎ.బాలకృష్ణ, లంకా బోసు, ఎం.అఖీల్, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మండలంలోని తిరుమలపురం కేతవరం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్యారెంటీ బాండ్‌లు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, గోలి అనిల్, యాగంటి సుబ్రహ్మణ్యం, కొఠారి ప్రసాద్, పెద్దమల్ల ధర్మేంద్ర, యారమల్ల సుబ్బారావు ధూళిపాల ప్రభాకర్ శాస్త్రి, వెలగల సత్యనారాయణ, బలుసు కిరణ్ కుమార్, తానిగడప నరేష్‌కుమార్, కనుపర్తి ఆనంద్‌కుమార్ పోలోతు అంజనేయులు పోలోతూ శ్రీనివాస్, నెరుసు సత్యనారాయణ, మందపాటి కుమార్, యర్రమల్ల వీరపండు, పెద్దమళ్ళ సాయి, కారిసెట్టి రామకృష్ణ, వరద మధు, పెద్దమళ్ళ రమేష్, చేతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


తిరుమలపురంలో భవిష్యత్ గ్యారెంటీ బాండ్ల పంపిణీ



అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సుందరి

అక్రమ నిర్మాణాలపై నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 15: నూజివీడు మండలం పల్లెర్లమూడిలో అక్రమ నిర్మాణాలపై సర్పంచ్‌కు నోటీసులు జారీ చేసినట్లు నూజివీడు డీఎల్‌పీవో ఎంవీఎస్ సుందరి తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. గ్రామంలో అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులపాక సౌమ్యరేఖను నిర్మాణాలపై ప్రశ్నించగా బస్ షెల్టర్ నిర్మిస్తున్నట్లు వివరణ ఇచ్చారని, అయితే ఇందుకు సంబంధించి పంచాయతీ అనుమతులు తీసుకోకపోవడంతో అనుమతులు పొందిన తరువాతే నిర్మాణం చేపట్టాలంటూ ఆదేశించామన్నారు. కాగా ప్రస్తుతం చేపట్టిన అక్రమ నిర్మాణం పక్కనే బస్ షెల్టర్ ఉండగా పక్కనే మరో బస్‌షెల్టర్ ఎందుకని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.



సేవాలాల్ జయంతి వేడుకలు

చాట్రాయి, ఫిబ్రవరి 15: సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని పోతనపల్లి శివారు గండిపాడు తండాలో ఘనంగా నిర్వహించారు. లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్‌కు ఈ సందర్భంగా గ్రామపెద్దలు పాంచాలి, బాలరాజు తదితరులు నివాళులర్పించారు. 1739లో జన్మించిన సేవాలాల్, బ్రిటిష్ కాలంలో లంబాడాలపై విధించిన క్రిమినల్ ట్రైబల్ చట్టాన్ని వ్యతిరేకించి దానిని రద్దుచేసేలా కృషి చేశారన్నారు. అడవుల్లో సంచార వాసులుగా ఉన్న లంబాడాలను తండాల రూపంలో స్థిరనివాసం ఏర్పరిచిన వ్యక్తి సేవాలాల్ అన్నారు. గ్రామపెద్దలు పేరయ్య, మంగయ్య, రాంబాబు, భాస్కర్‌రావు, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాంజీ జయంతి



కైకలూరు, ఫిబ్రవరి 15: తెలుగు యువత నాయకుడు దివంగత మాగంటి రాంజీ 40వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం కైకలూరు టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీ మాగంటి బాబు పార్టీ నాయకులతో కలిసి రాంజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. మండల పార్టీల అధ్యక్షులు నారగాని నాగేశ్వరరావు, పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, సీనియర్ నాయకులు చలసాని జగన్మోహనరావు, కొత్తూరి విఠల్, పరసా విశ్వేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, పార్టీ నాయకులు బీకేఎం నాని, పెన్మెత్స వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవినేని చంద్రశేఖర్‌కు నివాళి



ముసునూరు, ఫిబ్రవరి 15: మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు సోదరుడు దేవినేని చంద్రశేఖర్‌రావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో టీడీపీ మండల నాయకులు గురువారం ఆయన స్వగృహంలో చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షులు దేవినేని ఢలరామ్, మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరరావు, నాయకులు కాటేపల్లి నాగేశ్వరరావు, కంచర్ల సత్యనారాయణ దేవినేని ఉమాను పరామర్శించారు.

పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభం



కలిదిండి, ఫిబ్రవరి 15 : వెంకటాపురంలో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఏఎంసీ ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గద్దె ఆనంద్ కుమార్, కలిదిండి సర్పంచ్ మారుతీ ప్రసన్న, ఎంపీటీసీ సుమన్, సొసైటీ ఛైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



కైకలూరు, ఫిబ్రవరి 15: రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్తను పరామర్శించి టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం కైకలూరు మండలం రాచపట్నం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త ఈదా ఏబు రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతన్ని పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, ఎస్సీ సెల్ నాయకులు వాసిపల్లి సతీష్ కన్నా, వీరాబత్తిన సుధా, పళ్లెం తాతారావు, కైకలూరు పట్టణ ఉపాధ్యక్షుడు పడమటి వాసు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం వితరణ

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 15: రెండు రోజులుగా ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీనరసింహ వేద పాఠశాలలోని గోశాలకు వరి గడ్డి విరాళంగా ఇప్పించటంలో దాత వేణుగోపాలరెడ్డి కృషి చేస్తున్నారు. గురువారం పలగాని శోభనా చలపతి, ఉప్పలపాటి నాగేశ్వరరావు ఒక ఎకరం గడ్డి అందించగా వీరిని పాఠశాల కార్యదర్శి సూరిశర్మ అభినందించారు.

బడ్జెట్ సమావేశం.. గరం.. గరం..





అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్

- రాజకీయ ఆరోపణలకు వేదికైన వైనం
- మునిసిపల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 15: నూజివీడు మున్సిపల్ బడ్జెట్ ఆమోదానికి నిర్వహించిన సమావేశం గత, ప్రస్తుత ప్రభుత్వాలు అభివృద్ధికి సంబంధించి రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికగా మారింది. నూజివీడు మున్సిపల్ బడ్జెట్ ఆమోద సమావేశాన్ని ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పద్దుల కింద రహదారుల అభివృద్ధికి రూ. 46.24 కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు మున్సిపల్ అధికారులు అంచనాలు రూపొందించటంపై గత బడ్జెట్‌లో అభివృద్ధికి సంబంధించి ఎన్ని నిధులు వస్తాయని అంచనా వేశారు. ఎంత ఖర్చు చేశారు. అన్ని నిధులు ఎలా వస్తాయి అంటూ నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుపై ఆశతో బడ్జెట్‌లో నిధుల విషయమై ప్రస్తావించామని, సీఎం జగన్ రూ.16 కోట్లు ఇప్పటికే మంజూరు చేశారని, గత ప్రభుత్వం నూజివీడుకు నిధులేం ఇచ్చిందంటూ నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ ప్రశ్నించారు. దీంతో గత ప్రభుత్వ, ప్రస్తుత ప్రభుత్వ అభివృద్ధి పనులపై వాదప్రతివాదనలకు బడ్జెట్ సమావేశం వేదికగా మారింది. గత ప్రభుత్వంలో నూజివీడుకు రూ.250 కోట్లతో టిడ్కో భవనాలు మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం మిగిలిన పనులు నిర్వహించకుండా ఆపివేసిందని టీడీపీ కౌన్సిలర్లు, మీరు వదిలేసిన పనులను, బాకీలను మేము పూర్తి చేస్తున్నామంటూ అధికార పార్టీ కౌన్సిలర్లు వాదప్రతివాదనలకు దిగారు. నూజివీడుకు అవుటర్ రింగ్ ఏమైంది, మెడికల్ కళాశాల తీసుకువస్తామన్నారు ఎందుకు తేలేకపోయారు? చివరికి నూజివీడులో కోతుల బెడదను అరికట్టేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారంటూ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లు కొమ్మని విజయ తదితరులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజీనామా....

నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ రాజీనామా సమర్పించారు. వ్యక్తిగత కారణాల వల్ల పదవిలో కొనసాగలేనని, రాజీనామా లేఖను ఇవ్వగా టేబుల్ అజెండాలో రాజీనామాను కౌన్సిల్ ఆమోదించింది.

మున్సిపల్ బడ్జెట్‌లో తరుగుతున్న నిల్వలు

నూజివీడు మున్సిపల్ బడ్జెట్ నికర ఆదాయంగా 2023-24 సంవత్సరానికి బడ్జెట్ ప్రారంభ నిల్వ 12.17 కోట్లుగా చూపుతూ బడ్జెట్‌ను మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అధికార బృందం ప్రవేశపెట్టింది. గురువారం నూజివీడు మున్సిపల్ సమావేశ మందిరంలో 2023-24 సవరించిన బడ్జెట్‌ను, 2024-25కు సంబంధించి అంచనాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివిధ పద్దుల కింద రూ.60 కోట్ల 51 లక్షలు ఆదాయం వస్తుందని, అందులో వివిధ ఖర్చుల కింద రూ.62 కోట్ల 19 లక్షలు ఖర్చు కాగలవని అంచనా వేస్తూ సమాప్తపు నిల్వ రూ.10 కోట్ల 49 లక్షలుగా చూపారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే ఆదాయం వివిధ పద్దుల కింద అన్నీ కలుపుకుని రూ. 65.08 కోట్లు రాగలదని అంచనాతో ఖర్చులు 66.32కోట్లు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ప్రారంభ నిల్వ 10.49 కోట్లను కలుపుకుంటే 2024-25 సంవత్సరం ముగింపుకు 9.25 కోట్ల రూపాయల నిల్వ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇదమిద్ధంగా మున్సిపల్ బడ్జెట్‌లో నగదు నిల్వలను 2023-24 ఆర్థిక సంవత్సరంలో 12.17 కోట్లుగా ఉండగా, 2024-25 ముగింపుకు నిల్వలు కేవలం 9.25 కోట్లకు తగ్గడం విశేషం.

టీడీపీ రాగానే చింతలపూడి నిర్మాణం

- నవరత్నాల్లో సగం బటన్ నొక్కినా సాగు కష్టాలు తీరేవి
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 15: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే యుద్ధప్రాతిపదికన చింతలపూడిని ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి రైతులకు కానుకగా ఇస్తానని, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలో బుధవారం రాత్రి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్ నివాస గృహంలో పట్టణంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజానాడి స్పష్టంగా ఉందని, టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో పాత మున్సిపాలిటీల్లో నూజివీడు ఒకటని, అయినా ఆ స్థాయిలో నూజివీడు పట్టణం అభివృద్ధి సాధించలేదన్నారు. తాను అధికారంలోకి రాగానే మున్సిపల్ నిధులు, కేంద్ర నిధులు ఏవి అందుబాటులో ఉన్నా నూజివీడులో రహదారుల విస్తరణ చేపట్టడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు చేపట్టి పరిసర ప్రాంతాలకు కేంద్ర స్థానంగా నూజివీడును అభివృద్ధి చేస్తానన్నారు. నూజివీడు పట్టణంలో ముఖ్య కార్యకర్తలతో మాట్లాడటానికి వచ్చిన ఆయనను నూజివీడు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పసుపులేటి జగన్, పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్ సాదరంగా ఆహ్వానించారు. నూజివీడు కౌన్సిలర్‌లు యార్లగడ్డ ప్రసాద్, తిరుమలశెట్టి సాధనా స్రవంతి, పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: నవరత్నాలకు ఈ ప్రభుత్వం నొక్కుతున్న బటన్‌లో సగం బటన్ రైతుల సంక్షేమానికి కేటాయిస్తే సాగుకష్టాలు తప్పేవని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. వేల్పుచర్ల, బలివే గ్రామాల్లో గురువారం విస్తృతంగా పర్యటించారు. తొలుత టీడీపీ వేల్పుచర్ల గ్రామ అధ్యక్షులు మానం గంటేశ్వరరావు తదితరులతో సమావేశమై పలు విషయాలను చర్చించారు. అనంతరం పాదయాత్రగా గ్రామదేవత అంకమ్మ ఆలయానికి వెళుతుండగా స్థానికులు ఆయనకు తమ సమస్యలను వివరించారు. గడ్డం సుబ్బమ్మ నివాస గృహం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమై మూడేళ్ళు గడిచినా నేటికి ప్రభుత్వం నుంచి పరిహారం, ఇతర సదుపాయాలు అందలేదని పార్థసారధి దృష్టికి తేగా ఆయన వెంటనే ముసునూరు తహసీల్దార్ జవహర్ బాబీకి



వేల్పుచర్లలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఫోన్‌చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అగ్నిబాధిత కుటుంబానికి రూ.5వేలు నగదుతో పాటు పక్కా ఇల్లు మంజూరు చేయాలనే విషయం మీకు తెలియదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడురోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించి బాధితురాలికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అంకమ్మ వారిని దర్శించుకుని ఆలయానికి రూ.50 వేలు విరాళాన్ని ఆయన అందజేశారు.

చెక్‌డ్యామ్ పరిశీలన...

బలివే శివారు వెంకటాపురం తమ్మిలేరులో కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను పార్థసారథి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ చెక్‌డ్యామ్ నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ చెక్‌డ్యామ్ మంజూరైనప్పటికీ టీడీపీ ప్రభుత్వం దీన్ని నిర్మించిందని 2019-20 మధ్యలో కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యామ్, సప్లైఛానెల్ కొట్టుకుపోయి మరమ్మతుకు గురికాగా నేటి వరకు ఈ ప్రభుత్వం మరమ్మతులకు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో రైతుల సమస్యల పరిష్కారానికి నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం బలివే రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. టీడీపీ నాయకులు పర్వతనేని గంగాధర్, తుమ్మల నాగేశ్వరరావు, మానం వంశీ, గద్దె రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ముదినేపల్లి, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీవోల సంఘం ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలంలోని పలు శాఖల అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతున్నారు. సంఘ మండవల్లి యూనిట్ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు ఆధ్వర్యంలో మండలంలోని సుమారు 25 మంది ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద పరిపాలన అధికారి రమణబాబు, ఇతర సిబ్బంది విద్యాశాఖ అవుట్ సోర్సింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. డీఏ, జీపీఎస్ సరెండర్ లీవుల బకాయిలను విడుదల చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

తాళాలు పగులగొట్టి చోరీ

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 15: వాడవల్లి గ్రామానికి చెందిన దూసనపూడి గురుబ్రహ్మం మంగళవారం ఇంటికి తాళం వేసి వైద్యం నిమిత్తం విజయవాడ వెళ్లి బుధవారం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో దాచి ఉంచిన రూ. 2.03 లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించి బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకట కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కుట్టు మిషన్ల వితరణ

ముసునూరు, ఫిబ్రవరి 15: రమణక్కపేటలో హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ పూర్తిచేసిన మహిళలకు గురువారం కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. 20 మంది మహిళలకు జడ్పీటీసీ వరకూటి ప్రతాప్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఉచితంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. సిస్టర్ జయమేరీ, మెటిల్డా పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి చిన్నారుల సాయం



చాట్రాయి, ఫిబ్రవరి 15: దివ్యాంగుల ఆశ్రమానికి చిన్నారులు సేకరించిన నిధులను చాట్రాయి మండలం సూరంపాలెం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. ముత్తయ్య గురువారం ఆశ్రమ నిర్వాహకులకు అప్పగించారు. పాఠశాల చిన్నారులు మొత్తం రూ.1200 సేకరించగా పెదపాడులోని దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకుడు క్రీస్తుప్రకాష్‌కు అందించారు. ఈ సందర్భంగా చిన్నతనం నుంచే విద్యార్థులు చూపిన సేవాభావాన్ని ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు సీహెచ్. అనిత తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా గరుడోత్సవం



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 15: ఆగిరిపల్లి రథసప్తమి తిరునాళ్ళ సందర్భంగా గురువారం శోభనాచలుడు పెద్దగరుడ వాహనంపై విహరించారు. ఉదయం శాంతి కల్యాణంలో భాగంగా ఆకుల బసవా ప్రసాద్ సాయంత్రం జరిగే నిత్యకల్యాణంలో భాగంగా కమ్మ సంఘం ఆధ్వర్యంలో మాదల శివరామ్‌ప్రసాద్ దంపతులు కైంకర్య పరులుగా పాల్గొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

భోగేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



కలిదిండి, ఫిబ్రవరి 15: పాతాళ భోగేశ్వరస్వామి హుండీ ఆదాయం గురువారం లెక్కించగా, రూ.6.60 లక్షలు ఆదాయం లభించిందని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 12 నెలల కాల పరిమితికి ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ ఛైర్మన్ గంగాధర శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలపై సమీక్ష

శివరాత్రి సందర్భంగా కలిదిండిలోని పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు సహకరించాలని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఉత్సవాలకు విచ్చేసే భక్తుల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే కోనేరును నింపటానికి సీటీవంతు ఇవ్వాలన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు అధికారులు సహకరించాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్యశాఖ అధికారులు, సర్పంచ్ మారుతీ ప్రసన్న, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వాస్య మాతాంగిగా శ్రీశ్యామలాంబ

కైకలూరు, ఫిబ్రవరి 15: శ్యామలా నవరాత్రుల సందర్భంగా గురువారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారు వాస్యమాతాంగిగా దర్శనమిచ్చారు. ఆలయ మాజీ ఛైర్మన్ తెలగంశెట్టి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు ఉభయ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి అలంకరణ భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. శుక్రవారం అమ్మవారు సారికి శ్యామలాదేవిగా దర్శనమిస్తారని భక్తులు పెద్దఎత్తున దర్శించుకోవాలని కోరారు. అలాగే రథసప్తమి సందర్భంగా అమ్మవారి ఆలయంలో, మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యనమస్కారాలు, హోమాలు నిర్వహిస్తామని ఆలయ అధికారి శేఖర్ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

ముసునూరు, ఫిబ్రవరి 15: ముసునూరు నూతన ఆలయంలో కార్యసిద్ధి శ్రీ పంచముఖ అంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదాంతం వేణుగోపాలచార్యుల ఆధ్వర్యంలో హోమాలు తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 19వ తేదీ ఉదయం 5.30 గంటలకు స్వామివారి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు ఆంజనేయస్వామికి తమలపాకులతో అర్చన

మండవల్లి, ఫిబ్రవరి 15: మండవల్లిలో నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ, ధర్మదాయశాఖ పర్యవేక్షణలో ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఆంజనేయస్వామికి సహస్ర తమలపాకులతో అర్చన, గంధ సింధూర పూజ నిర్వహించనున్నట్లు అర్చకులు గూడురు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. హనుమాన్ జంక్షన్ నుంచి ఆంజనేయస్వామి రథం 16వ తేదీ ఉదయం వస్తుందని తెలిపారు. తమలపాకుల పూజ చేసే భక్తులకు పూజాద్రవ్యాలు నిర్వాహకులే ఉచితంగా ఇస్తారని, పూజలో పాల్గొనే భక్తులకు స్వామివారి ప్రతిమ ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు.

వైభవంగా అంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ముసునూరు, ఫిబ్రవరి 15: వేల్పుచర్లలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని, పలు పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ

అతివేగం ప్రమాదకరం

నూజివీడు, ఫిబ్రవరి 15: అతివేగం ప్రాణాలను బలి తీసుకుంటుందని నూజివీడు ఎంవీఐ జి.నాగమురళి అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా రహదారి భద్రత-మనందరి బాధ్యత అనే అంశంపై నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల్లో అసువులు బాసిన వారి వయస్సు 16 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటోందన్నారు. ప్రమాదాలు నివారించేందుకు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టును తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మైలవరం బెస్ట్ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జమలయ్య, సారథి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్, ఏవో రామచంద్రరావు, రూరల్ సీఐ బాలసురేష్‌బాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.



దిగవల్లి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ దేవసాగర్

కుష్ఠు నివారణపై దృష్టి పెట్టాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 15: లెప్రసీ కేసులపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది దృష్టి సారించి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం (ఎన్‌ఎల్‌ఈపీ) రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఎస్.దేవసాగర్ సూచించారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని దిగవల్లి, రమణక్కపేట, ముసునూరు పీహెచ్‌సీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు నివారణకు గాను పాత కుష్ఠు కేసులను ఫాలో అప్ చేయడంతో పాటు కొత్తగా నమోదవుతున్న కేసులపై దృష్టి సారించాలన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందితో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే సకాలంలో పూర్తిచేయాలి

ముసునూరు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం లెప్రసీ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని ఎస్‌ఎల్‌ఈపీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.దేవసాగర్ అన్నారు. గురువారం ముసునూరు పీహెచ్‌సీలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి లెప్రసీ సర్వేపై ఆయన అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి బాధితులను గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో పొందుపర్చి సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని దేవసాగర్ సూచించారు. డాక్టర్ షకీనా ఇవాంజిలిన్, సూపర్‌వైజర్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్ర జిల్లా కన్వీనర్‌గా కోటప్రోలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 15 : బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న ప్రజాపోరు యాత్ర ఏలూరు జిల్లా కన్వీనర్‌గా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రజాపోరు యాత్రలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని కృష్ణారావు తెలిపారు.



పరిశీలిస్తున్న స్టేట్ ట్రైనింగ్ అసోసియేట్ పాండురంగారావు

కృత్యాధార బోధనలో ముందున్న ఈదర

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కృత్యాధార విద్యాబోధనలో ఈదర మెయిన్ పాఠశాల ప్రథమంగా నిలిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మక్కే వేణుగోపాలరావు అవిశ్రాంత కృషితో 17 అడ్మిషన్స్‌తో మండలంలో మొదటి స్కూల్‌గా నిలిచింది. ఆడుతూ పాడుతూ నేర్చుకునే విద్య (కృత్యాధార)లో ప్రథమస్థాయిలో ఉన్న ఈదర మెయిన్ పాఠశాలను జ్ఞానప్రకాష్‌లో భాగంగా స్టేట్ ట్రైనింగ్ అసోసియేట్ ఎం. పాండురంగారావు సందర్శించారు. ప్రతి విద్యార్థి అభ్యసనతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయిని ఎం.నిర్మలాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందితో ప్రజాప్రతినిధులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని వడాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రగతిపై ప్రధానోపాధ్యాయుడు ప్రజాప్రతినిధులకు వివరించారు. జడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ మరీదు దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.